## అమెరికాలో యుద్ధ వ్యతిరేక ప్రదర్శన

### 100 మంది అరెస్టు




**న్యూయార్క్:** ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అమెరికా మన్‌హట్టన్‌లో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. దీంతో పోలీసులు తీవ్రంగా స్పందించారు. 100 మంది ప్రదర్శకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. మన్‌హట్టన్ థర్డ్ ఎవెన్యూను ప్రదర్శకులు దిగ్బంధనం చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి వారిని చెదరగొట్టారు. ఆ రహదారిలో రాకపోకలను పునరుద్ధరించారు. ఇజ్రాయెల్‌కు వేలాది బాంబులు,యుద్ధసామాగ్రి విక్రయాలు నిలిపివేయాలని సెనేట్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు ఛెక్ షూమర్, సెనేటగర్ గిల్లీ బ్రాండ్‌లను కోరుతూ ప్రదర్శకులు నినాదాలు చేశారు.

జియోనిస్టు వ్యతిరేక బృందమైన ''జ్యూయిష్ వాయిస్ ఫర్ పీస్' ఆధ్వర్యంలో వందలమంది ప్రదర్శకులు మన్‌హట్టన్‌లో ఉన్న ఈ ఇద్దరు సెనేటర్ల కార్యాలయాలలోకి చొచ్చుకువెళ్ళే ప్రయత్నం చేశారు. లెబనాన్‌లో యుద్ధ తీవ్రతకు, ఇరాన్‌లో దాడులకు సహకరిస్తున్నారని విమర్శిస్తూ ప్రదర్శకులు వారిని నిలదీసేందుకు వెళ్ళారు. తక్షణం యు ద్ధం ఆపాలని, ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా నిలిపివేయాలని, పశ్చిమాసియాలో చర్చలకు అవకాశం ఇవ్వాలని, అమెరికా బలగాలు వెనక్కు రా వాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవుల నుండి ఎలాంటి ఆర్థిక కార్యకలాపాలు సాగనివ్వకుండా అడ్డుకునేందుకు దిగ్బంధన చర్యను ట్రంప్ ప్రారంభించడంతో ప్రదర్శకులు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు.

# వీలైనంత త్వరగా యుద్ధం ఆపాలి

- మొదటిసారి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటన
- భాగస్వామ్య దేశాలన్నీ సహనం, మౌనం పాటించాలి
- పశ్చిమాసియా దేశాల సార్వభౌమత్వానికి సంపూర్ణ గౌరవమిద్దాం
- ఆటవిక దశకు వెళ్ళకుండా అంతర్జాతీయ చట్టాలు పాటిద్దాం
- చైనా నిర్మాణాత్మక పాత్ర కొనసాగిస్తుంది
- శాంతికి నాలుగు సూత్రాల ప్రతిపాదన

**బీజింగ్:** ఇరాన్ సార్వభౌమత్వంతోపాటు పశ్చిమాసియాలోని అన్ని దేశాల సార్వభౌమాధికారాన్ని సంపూర్ణంగా గౌరవించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పిలుపు ఇచ్చారు. 'హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకల విఘాతానికి మూల కారణం సైనిక సంఘర్షణే..ఈ సమస్యను పరిష్కరించాలి, ఈ యుద్ధాన్ని తప్పనిసరిగా వీలైనంత త్వరగా ఆపాల్సిందే, ఇందులో భాగస్వాములుగా ఉన్న అన్ని దేశాలు మౌనం పాటించాలి, సహనం వహించాలి,చైనా తన నిర్మాణాత్మక పాత్ర కొనసాగిస్తుంది'' అని జిన్‌పింగ్ ప్రకటించారు. ఈ యుద్ధ సమయంలో మొదటిసారి ఒక గల్ఫ్ దేశ నాయకుడు చైనాలో పర్యటించి చర్చలు జరిపిన సందర్భంగా జిన్‌పింగ్ పైవిధంగా స్పందించారు. ఇరాన్–అమెరికా మధ్య 45 రోజుల యుద్ధం తర్వాత మొట్టమొదటిసారి ఆయన నోరు విప్పి స్పందించారు. పశ్చిమాసియాలో గల్ఫ్ దేశాల సార్వభౌమత్వం,ప్రాదేశిక సమగ్రత, భద్రతలను సంపూర్ణంగా కాపాడాలని, కోరారు.హోర్ముజ్ జలసంధిలో నౌకలు స్వేచ్ఛగా రాకపోకలు చేయడాన్ని గౌరవించాలని అమెరికాకు చైనా హితవు చెప్పారు. అంతర్జాతీయ చట్టాలకు



కట్టుబడి పనిచేయాలని, పూర్వాకాలంనాటి ఆటవికరాజ్య జీవితంలోకి దిగజారిపోకుండా అంతర్జాతీయ చట్టాలను తూ.చ తప్పకుండా పాటించాలని కోరారు. ఇరాన్,రష్యాలతో చైనా అత్యంత సన్నిహిత, వ్యూహాత్మక సంబంధాలను కొనసాగిస్తున్నది. ఇన్నాళ్ళుగా జరుగుతున్న యుద్ధాన్ని చైనా మౌనంగా,నిశితంగా గమనిస్తూ వచ్చింది. తెరవెనుక తనవంతు కృషి చేస్తూ వచ్చింది. డోనాల్డ్ ట్రంప్ సోమవారం సాయంత్రం నుండీ ఇరాన్ ఓడరేవులను పూర్తిగా దిగ్బంధనం చేయడం ప్రారంభించారు. హోర్ముజ్ జలసంధి అంతర్జాతీయంగా అన్ని దేశాల వాణిజ్యానికీ అతిముఖ్యమైన రాకపోకల మార్గం కావడంతో ఇరాన్‌లో యుద్ధం ప్రపంచ సమస్యగా మారింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హోర్ముజ్ జలసంధిలో ఉమ్మడి ప్రయోజనాలు నెరవేరేందుకు వీలుగా ఈ ప్రాంతాన్ని సుస్థిరంగా,సురక్షితంగా ఉంచాల్సిన బాధ్యత అన్ని దేశాలపైనా ఉందని జిన్‌పింగ్ చెప్పారు. మంగళవారం ఆయన ఏకంగా మూడు దేశాల ముఖ్య నేతలను కలుసుకుని వారితో భేటీలు నిర్వహించి బిజీ బిజీగా గడిపారు. స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అబుధాభి యువరాజు షేక్ ఖాలెద్ బిన్ మహ్మద్ బిన్ ఖాలెద్ నహ్యాన్,రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్‌లతో ఆయన సమావేశాలు నిర్వహించారు. అబుధాభి యువరాజు నహ్యాన్‌తో సమావేశం సందర్భంగా పశ్చిమాసియా సమస్యలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో శాంతికి ఆయన నాలుగు సూత్రాల ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. శాంతియుత సహజీవనం,జాతీయ సార్వభౌమాధికారం,అంతర్జాతీయ చట్టబద్ధ పాలన,అభివృద్ధి సూత్రం, భద్రతా సమన్వయానికి కట్టుబడి ఉండే సూత్రాలను జిన్‌పింగ్ ప్రతిపాదించారు. వ్యక్తిగత భద్రత, మౌలిక సదుపాయాల భద్రత, పశ్చిమాసియాలోని అన్ని దేశాలలో ఉన్న వ్యవస్థలకు సమగ్ర భద్రత,రక్షణ ఉండాలన్నారు. పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతానికి ఒక ఉమ్మడి, సమగ్ర, సహకార ధోరణితో కూడిన, స్థిరమైన భద్రతా వ్యవస్థ నిర్మాణం జరగాలని ప్రతిపాదించారు. అభివృద్ధి,భద్రతకు సమన్వయ దృక్పథంతో ప్రధన ప్రాధాన్య ఇవ్వాలని, పశ్చిమాసియాలో దేశాల అభివృద్ధికి, గల్ఫ్ ప్రాంత అభివృద్ధికి భాగస్వామ్య వర్గాలన్నీ ఒక సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు కలిసి పనిచేయాలని కోరారు.

# లెబనాన్‌లో ఆగని దాడులు–మరోవైపు చర్చలు

### భేటీ రద్దుకు హెజ్బొల్లా డిమాండ్



**వాషింగ్టన్:** ఇజ్రాయెల్–లెబనాన్‌లో ఇజ్రాయెల్ భయంకరమైన దాడులు ఆగకుండా కొనసాగుతుండగా మరోవైపు శాంతి అమెరికా రాజధానిలో చర్చలకు రంగం సిద్ధమైంది. అమెరికాలో ఉన్న లెబనాన్ దౌత్యవేత్త నాదా హమాదే మోవాహ్, అమెరికాలో ఇజ్రాయెల్ దౌత్యవేత్త యెచియెల్ లీటర్, లెబనాన్‌లో అమెరికా దౌత్యవేత్త మైఖేల్ ఇస్సా ముగ్గురు చర్చల నిమిత్తం వాషింగ్టన్‌కు చేరుకున్నారు. లెబనాన్‌తో తాజాగా ఆసుపత్రిని ఇజ్రాయెల్ దళాలు ధ్వంసం చేయగా, నబలియాహ్ ప్రాంతంలో కూడా దాడులు కొనసాగాయి. ఈ యుద్ధంలో ఇప్పటివరకూ 2,020 మంది మరణించారు. మరో 1500 మంది గాయపడ్డారు. అదేవిధంగా మరో ఇజ్రాయెల్ సైనికుడు కూడా లెబనాన్‌లో మరణించాడు. వాషింగ్టన్ చర్చల్లో ముఖాముఖీ పాల్గొనేందుకు మొదట లెబనాన్ ప్రధానమంత్రి నవాఫ్ సలామ్ సిద్ధమయ్యారు. ఇజ్రాయెల్‌ను తమ భూభాగం నుండి వెళ్ళగొడతామని, అప్పటివరకూ శాంతి యత్నాలు కొనసాగిస్తామని ఆయన తొలుత చెప్పారు. కానీ ఇరాన్, హెజ్బొల్లాల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆయన వెనుకంజవేశారు. హెజ్బొల్లా ఉగ్రవాద నాయకత్వం ఈ చర్చల ప్ర క్రియను తీవ్ర వ్యతిరేకిస్తోంది. ఇజ్రాయెల్‌తో చర్చల నుండి వైదొలగాలని ఇరాన్ మద్దతుగల లెబనాన్‌లోని ఉగ్రవాద సంస్థ, రాజకీయపార్టీ ''హెజ్బొల్లా'' నాయకత్వం కోరుతున్నది. మార్చి రెండో తేదీ నుండి లెబనాన్‌లో ఇజ్రాయెల్ ప్రా రంభించిన యుద్ధం కారణంగా వేలాదిమంది మరణించారు. లెబనాన్‌ను మరో గాజాగా మార్చాలని ఐడిఎఫ్ ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ఆ దేశంతో చర్చల అవసరం లేదని హెజ్బొల్లా చెబుతున్నది. యుద్ధంవల్ల లెబనాన్‌లో చాలా తీవ్రస్థాయిలో బలహీనపడిపోయిన హెజ్బొల్లాను నిరాయుధీకరణ దిశగా నడిపించడం, ఇజ్రాయెల్ బాంబింగ్‌ను నిలిపివేయడం, లెబనాన్ నుండి ఇజ్రాయెల్ సైన్యాలను వెనక్కు పంపేయడం వంటి ఇరుపక్షాల డిమాండ్లతో ఈ చర్చలకు తెర లేచింది. హెజ్బొల్లాను నిరాయుధులను చేయాలని మొదటినుండీ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ప్రధాన ఎజెండాగా నిర్దేశించుకున్నారు. ఒకప్పటి సైనిక దళాల ప్రధానాధిపతి, లెబనాన్ ప్రస్తుత అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ కూడా హెజ్బొల్లాను నిరాయుధులను చేయాలని పట్టుదలతో ఉన్నారు. లెబనాన్‌లో ఉన్న హెజ్బొల్లా ప్రతిపక్షం కూడా ఇరాన్ ఇస్తున్న మద్దతును వ్యతిరేకిస్తున్నది. షియా దేశం ఇరాన్ ప్రయోజనాలను కాపాడుతున్న హెజ్బొల్లా లెబనాన్‌ను కూడా యుద్ధంలో కూరుకుపోయేట్టు చేసిందని ప్రతిపక్షం విమర్శిస్తోంది. అలీ ఖమేనీ ఫిబ్రవరి 28 దాడుల్లో మరణించిన తర్వాత ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ ప్రయోగాలు చేయడంతో లెబనాన్‌లోకి మార్చి రెండో తేదీన ఇజ్రాయెల్ పదాతి దళాలు ప్రవేశించి బీభత్సం సృష్టించడం ప్రారంభించాయి. ఈ నెల ఎనిమిదో తేదీన ఇరాన్‌తో అమెరికా కాల్పుల విమరణకు అంగీకరించిన రోజున ఇజ్రాయెల్ భారీస్థాయిలో విధ్వంసం సృష్టించి 300 మంది హెజ్బొల్లా,లెబనీ ప్రజలను బలి తీసుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీంతో లెబనాన్‌ను కూడా శాంతి ఒప్పందంలో చేర్చాలని ఇరాన్ డిమాండ్ చేయడం ప్రారంభించింది.

## చైనా–స్పెయిన్ వాణిజ్య బంధం విస్తరణ

### జిన్‌పింగ్‌తో పెడ్రో శాంఛెజ్ సమావేశం

**బీజింగ్:** వాణిజ్య సంబంధాలను విస్తరించుకోవాలని చైనా–స్పెయిన్ దేశాలు నిర్ణయించాయి. చైనాలో మూడు రోజుల పర్యటన చేస్తున్న స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్‌తో మంగళవారం ముఖాముఖీ చర్చల సందర్భంగా, వాణిజ్యం, న్యూ ఎనర్జీ, ఇంటిలిజెంట్ ఎకానమీ రంగాలలో ఇరు దేశాల సంబంధాలను విస్తరించాలని, క్రీడలు,విద్యా,సాంస్కృతిక, శాస్త్రపరిశోధనా రంగాలలో నిరంతర ఆదాన ప్రదానాలు కొనసాగాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ కోరారు. రెండు దేశాల ప్రజలకు మేలు జరిగేవిధంగా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. జిన్‌పింగ్‌తోపాటు ప్రధానమంత్రి లీ ఖియాంగ్‌లతో కూడా శాంఛెజ్ వరుస సమావేశం నిర్వహించారు. చైనాతో స్పెయిన్ ఆర్థిక,వాణిజ్య సంబంధాలను గతంకంటే భిన్నంగా పటిష్టం చేసుకోవడానికి ఈ పర్యటనను సద్వినియోగం చేసుకోవాలని ఆయన గాఢంగా కోరుకుంటున్నారు.

ఈ నెల 15 వరకూ ఆయన చైనాలో పర్యటిస్తారు. బహుళ ధృవ ప్రపంచంలో రాబోయేకాలంలో చైనా కీలకపాత్ర పోషించాలని స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ కోరారు. చైనాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం వెళ్ళిన శాంఛెజ్ సోమవారం సింఘువా విశ్వవిద్యాలయంలో ప్రసంగించారు. యుద్ధాలను ముగించేందుకు ఉదాహరణకు పశ్చిమాసియాలో యుద్ధాలు ముగించేందుకు చైనా పెద్ద పాత్ర నిర్వహించాలని కోరారు. మంగళవారం ఉదయం పెడ్రో శాంఛెజ్ వరుసగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో, ప్రధానమంత్రి లీ ఖియాంగ్‌లతో సమావేశాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా చైనా పర్యటనలో నాలుగు సందేశాలను ప్రముఖంగా తెరమీదకు తీసుకురావాలని పెడ్రో శాంఛెజ్ నిర్దేశించుకున్నారు.

ప్రపంచ సమస్యలపై చైనా స్పందించి ముఖ్యపాత్ర పోషించాలని, అమెరికాను వెనక్కు నెట్టేందుకు మరింత కృషి చేయాలని, చైనా–యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్య అసమతౌల్యం అస్థిరంగానే కొనసాగుతుందని, అంతిమంగా స్పెయిన్ ఆర్థిక సమస్యల నుండి గట్టెందుకు వీలుగా విస్తారంగా మార్కెట్ అవకాశాలు తెరవాలని శాంఛెజ్ కోరేందుకు సిద్ధపడ్డారు.

## ట్రంప్ మోదీ చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు ప్రారంభించిన ఇరవైనాలుగు గంటల తర్వాత ఈ ఫోన్ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. అదీకాకుండా, మొదటి ఇరవైనాలుగు గంటల్లోనే చైనా నౌక ధీమాగా దిగ్బంధనాన్ని సవాలు చేసి జలసంధి దాటి వెళ్ళడం అమెరికా సైన్యం సిద్ధంగా లేకపోవడమేనని వార్తలు వెలువడినప్పటికీ హోర్ముజ్‌పై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ పట్టు,ప్రభావాన్ని చాటి చెబుతున్నది. ఈ పరిస్థితుల్లో హోర్ముజ్ జలసంధిని తెరచి ఉంచాల్సిన ప్రాధాన్యత, నౌకా స్వేచ్ఛ, చమురు సమస్యల గురించి ప్రధానంగా ట్రంప్‌కు మోదీ వివరించి ఉంటారని భావిస్తున్నారు. ప్రధానంగా హోర్ముజ్ జలసంధిలో దిగ్బంధనమే వారి మధ్య సంభాషణల్లో ప్రధానాంశంగా ఉంది. ఈ ఇద్దరు నాయకులమధ్య ఈ ఏడాది ఇప్పటివరకూ దీంతో మూడుసార్లు ఫోన్ సంభాషణలు జరిగాయి. మొదట ఫిబ్రవరి రెండో తేదీన వారు వాణిజ్య ఒప్పంద చర్చల పురోగతిపై ఫోన్ సంభాషణ చేశారు. మార్చి 24న పశ్చిమాసియా పరిస్థితిపై ఒకసారి చర్చించారు. ఇప్పుడు మళ్ళీ హోర్ముజ్ జలసంధి విషయంతోపాటు వాణిజ్య ఒప్పందం వంటి కీలక ఆర్థిక అంశాలను వారు చర్చించారు.

## 850వరకు పెంపు!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రతినిధి, సంబంధిత రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. కమిషన్‌కు సహాయ, సహకారాలను అందించేందుకు ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని సభ్యులుగా తీసుకుంటారు. ఆ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే ఐదుగురు లోక్‌సభ సభ్యులు, ఐదుగురు శాసనసభ సభ్యులను సంబంధిత సభల స్పీకర్లు నామినేట్ చేస్తారు.

**2011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ సీట్ల పెంపు**

2011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ సీట్ల పెంచాలని బిల్లులో కేంద్రం ప్రతిపాదించింది. ఆ గణాంకాల ప్రకారమే ఎస్‌సి, ఎస్‌టి, మహిళా రిజర్వేషన్లు ఖరారు అవుతాయన్న కేంద్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా బిల్లులో చేర్చింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో వీలైనంత మేరకు మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించేలా కమిషన్ చర్యలు తీసుకుంటుందని కేంద్రం తెలిపింది. ఈ సీట్లలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా రిజర్వేషన్లు ఉంటాయని స్పష్టం చేసింది. రొటేషన్ విధానంలోనే రిజర్వేషన్లు అమలవుతాయని పేర్కొంది. మహిళలకు రిజర్వ్ చేసిన సీట్లను ఆయా రాష్ట్రాలు లేదా కేంద్రపాలిత ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు రొటేషన్ పద్ధతిలో కేటాయిస్తారని తెలిపింది. నియోజకవర్గాల పునర్విభజనలో భౌగోళిక సమగ్ర త, పరిపాలనా సరిహద్దులు, రవాణా సౌకర్యాలు వంటి అంశాలను డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుందని కేంద్రం వెల్లడించింది.

**33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలే లక్ష్యం!**

కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలును సులభతరం చేసేందుకు ఉద్దేశించిన కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు2026'ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో, అలాగే దిల్లీ , పుదుచ్చేరి, జమ్మూ కశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఈ బిల్లును ఉద్దేశించారు.

ఈ బిల్లు ద్వారా అసెంబ్లీలు ఉన్న దిల్లీ, జమ్ముకశ్మీర్, పుదుచ్చేరికి సంబంధించిన 3 చట్టాలను సవరించనున్నారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ యాక్ట్1963, గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ యాక్ట్1991, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం2019లో సవరణలు చేయనున్నారు. ఆయా శాసనసభల్లో నియోజకవర్గాల పునర్విభజన సహా 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలే లక్ష్యంగా ఈ సవరణలుచేయనున్నారు.

## రెండో విడత చర్చలు?

(మొదటి పేజీ తరువాయి)

ఎలాగైనా తెరచుకుంటుందన్న ఆశలు సన్నగిల్లిన సమయంలో రెండో విడత చర్చల ప్రకటన మార్కెట్లకు ఊపిరిపోశాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 97 డాలర్లకు తగ్గింది. ముందురోజు సోమవా రం పాకిస్థాన్ అత్యవసర మంత్రివర్గ సమావేశంలో, శాంతి సాధనకు ఇప్పటివరకూ చేసిన కృషిని ప్రధానమంత్రి షరీఫ్ వివరించారు. చర్చల్లో పురోగతి సాధించామని సంతృప్తి ప్రకటించారు. నిర్మాణాత్మకమైన ఫలితాలుత వచ్చాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో యుద్ధ భయాలను ఈ చర్చలు తొలగించాయని, ప్రపంచ ఆర్థిక అనిశ్చితిమధ్య శాంతి వాతావరణా న్ని ఈ చర్చలు సృష్టించాయని చెప్పారు. ఓస్లో, జెనీవా ఒప్పందాలు,గుడ్ ఫ్రైడే ఒప్పందాలు వంటి చరిత్రాత్మకమైన ఒప్పందాలన్నీ కుదిరి అమలు కావడానికి అనేక సంవత్సరాలు పట్టిందని, కానీ, రెండు శత్రుదేశాలమధ్య పాకిస్థాన్ చర్చల ద్వారా బ్రహ్మాండమైన ముందడుగు వేయించిందని షరీఫ్ చెప్పారు.

ఇరాన్–అమెరికా మధ్య ఏప్రిల్ ఎనిమిదో తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ఈనెల 21వ తేదీతో అంటే మరో ఏడు రోజుల్లో ముగిసిపోతుం ది. ఈ లోపే రెండో విడత సమావేశం జరగాలని పాకిస్థాన్ ప్రయత్నం చేస్తోంది. పైగా సమస్యల పరిష్కారానికి కేవలం కొన్ని అంగుళా ల దూరంలో ఉన్న సమయంలో అమెరి కా ప్రతినిధులే చర్చలను కుప్పకూల్చేశారని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఆదివారం సాయంత్రం విమర్శలు చేశారు. కేవలం ఒక్క సమావేశంలోనే చర్చలు ముగిసి ఒప్పందం కుదురుతుందని తాము ఆశించలేదని, అలాంటి అంచనాలతో ఇస్లామాబాద్ చర్చలకు వెళ్ళలేదని ఆయన సానుకూల ప్రకటన చేశారు. చర్చలకు ఇంకా తలుపులు తెరచే ఉన్నాయని అరాఘ్చి సానుకూల ప్రకటనలు చేస్తూ ఉండగా, ఇరాన్ చర్చలకు వచ్చినా రాకపోయినా తమకు పెద్దగా నష్టం లేదని ట్రంప్ నిర్లక్ష్యపూరిత ప్రకటన చేశారు. ఇరాన్ అణుకార్యక్రమం, హోర్ముజ్ జలసంధి ప్రధానాంశాలుగా ఏప్రిల్ 11న చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఒక ఒప్పందానికి రాకుండానే ఎవరి దారిన వారు వెళ్ళిపోయాఆరు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఇరవై సంవత్సరాలపాటు ఆపేయాలని అమెరికా డిమాండ్ చేయగా, కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే విరామం ఇచ్చేందుకు మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్, అబ్బాస్ అరాఘ్చి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇందుకు అమెరికా ప్రధాన ప్రతినిధి, ఆ దేశ ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్,స్టీవ్ విట్‌కాఫ్,జెరెడ్ కుష్నెర్ అంగీకరించలేదు.ఒప్పందం కుదరాలంటే ''ప్రస్తుతం బంతి ఇరాన్ కోర్టులోనే ఉంది, మరిన్ని చర్చలు జరుగుతాయా?లేదా? అనే నిర్ణయం వారిదే'' అని జె.డి.వాన్స్ మంగళవారం సరికొత్త ప్రకటన చేశారు. భవిష్యత్ చర్చల నిర్ణయం వారిపైనే ఆధారపడి ఉందని అన్నారు. మొదటి విడత చర్చలో చాలా వరకూ ప్రగతి సాధించామని కూడా అన్నారు. ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ ప్రధానమంత్రి షరీఫ్, ఉప ప్రధానమంత్రి–విదేశీవ్యవహారాలమంత్రి ఇషాక్ దార్, ఆ దేశ సర్వసైన్యాధిపతి, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ కలిసి ఎలాగైనా రెండోసారి వైరి వర్గాలను చర్చల బల్ల దగ్గరకు తీసుకువచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని 'ద ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' పేర్కొంది. పాకిస్థాన్‌సహా టర్కీ,ఈజిప్టు నాయకులు చేస్తున్న ప్రయత్నాలు,ఇరాన్ సానుకూల సంకేతాలను బట్టి ఈ వారంలోనే ఖచ్చితంగా చర్చలు జరిగే వాతావరణం కనిపిస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమై ఇప్పటికే 45 రోజులు గడిచాయి. హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు ట్రంప్ ఇచ్చిన గడువు మరో రెండు గంటల వ్యవధిలో ముగిసిపోతుందన్న సమయంలో రెండు వారాల కాల్పుల విరమణకు ట్రంప్ అంగీకరించారని ఏప్రిల్ 8వ తేదీన పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. ఆ తర్వాత ఏప్రిల్ 11న ఇస్లాబాద్‌లో ప్రారంభమైన చర్చలు 21గంటలపాటు కొనసాగాయి.

**ఇజ్రాయెల్–హెజ్బొల్లా దాడులు**

మరోవైపు ఉత్తర ఇజ్రాయెల్‌లో మంగళవారం ఉదయం హెజ్బొల్లా సైనికులు రాకెట్ దాడులు చేశారు. దీంతో సర్వత్రా సైరన్ మోతలు మోగాయి. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మరోవైపు లెబనాన్‌లోని బింట్ జెబైల్‌లో ఇజ్రాయెల్ భీకర ఘర్షణలు కొనసాగుతున్నాయి.ఇజ్రాయెల్ దళాలు బహుముఖ దాడులు చేసినప్పటికీ ముందంజ వేయడంలో విఫలమయ్యాయి. ముందుకు సాగుతున్న ఐ.డి.ఎఫ్ దళాలను లక్ష్యంగా చేసుకుని వందలకొద్దీ డ్రోన్లు, రాకెట్లతో దాడులు చేస్తున్నట్లు హెజ్బొల్లా పేర్కొంది. అమెరికా నాయకత్వంలో వాషింగ్టన్‌లో తలపెట్టిన చర్చలు రద్దుచేయాలని, ఇరాన్‌తో పాటే లెబనాన్‌లో కూడా కాల్పుల విరమణను అమలు చేయాలని హెజ్బొల్లా నాయకుడు నయీమ్ ఖాసెమ్ మరోవైపు డిమాండ్ చేస్తున్నారు.ఈ డిమాండ్లు యుద్ధ విస్తృతికి సంకేతాలు ఇస్తున్నాయి. ఈ ప్రాంతంలో గాజా తరహాలోనే దీర్ఘకాలిక అస్థిరత,హింస కొనసాగుతుందని ప్రజల్లో భయాందోళనలు పెరుగుతున్నాయి.

## భారీ ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

తెలియదని, ప్రతిపాదిత రాజ్యాంగ సవరణకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ ప్రక్రియను ఇంత గోప్యంగా ఉంచడం వెనుక తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందన్న అనుమానం మరింత బలపడుతుందని, దక్షిణాది రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆయన అన్నారు. ఈనెల 16న జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ప్రస్తావిస్తూ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బలవంతంగా ఏర్పాటు చేశారని స్టాలిన్ విమర్శించారు. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్‌పై రాజ్యాంగ సవరణను బలవంతంగా ఆమోదింపజేయాలని చూస్తోందని ఆరోపించారు. తమిళనాడుతో సహా దక్షిణ రాష్ట్రాలపై కేంద్రం తన నిర్ణయాన్ని బలవంతంగా రుద్దాలని చూస్తోందని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. డీలిమిటేషన్‌ను హడావిడిగా ఆమోదింపజేయడానికి చేస్తున్న ఈ ప్రయత్నం, బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యంపై చేస్తున్న దారుణమైన దాడి అని, అంతకంటే మించి, ఇది రాష్ట్రాల హక్కులపై ప్రత్యక్ష దాడి అని స్టాలిన్ అన్నారు. తమిళనాడుకు హాని కలిగించే విధంగా గానీ, ఉత్తర రాష్ట్రాల రాజకీయ బలాన్ని అసమానంగా పెంచే విధంగా గానీ ఏదైనా చేస్తే, తమిళనాడులో తాము మౌనంగా ఉండబోమన్నా రు. తమిళనాడు స్తంభించిపోతుందని ద్రవిడ పార్టీ అధినేత హెచ్చరించారు.'తమిళనాడు పూర్తి శక్తితో తన నిరసనను నమోదు చేస్తుంది. ప్రతి కుటుంబం వీధుల్లోకి వస్తుంది. తమిళనాడు ముఖ్యమంత్రిగా నా నాయకత్వంలో ఒక భారీ ఆందోళనను నిర్వహిస్తాము' అని అన్నారు. ఇది ఎన్నికల సమయం కాబట్టి, అందరి దృష్టి వేరే చోట ఉంటుంది కదా అని ఢిల్లీలో నిశ్శబ్దంగా నియోజకవర్గాల పునర్విభజన చేయవచ్చని భావించరాదని డిఎంకె అధినేత అన్నారు. అలాంటి ఆలోచన చేయవద్దని, తాను కేవలం తమిళనాడు ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా ఒక గొప్ప ఉద్యమమైన 'ద్రవిడ మున్నేట్ర కజగం' (డిఎంకె) నాయకుడిగా మాట్లాడుతున్నానని స్టాలిన్ పేర్కొన్నారు. 'మీరు ఇంతకు ముందెన్నడూ చూడని ఒక తమిళనాడును ఇకపై చూడబోతున్నారు. 1950లు, 1960ల నాటి డిఎంకె స్ఫూర్తిని భారతదేశం మరోసారి వీక్షించబోతోంది. దీనిని ఒక బెదిరింపుగా పొరబడకండి. ఇది ఒక హెచ్చరిక. ఒకవేళ మీరు దీనిని బెదిరింపుగానే భావించినా సరే, మాకు దానితో సంబంధం లేదు. అవును, ఇది తమిళనాడు నుండి జారీ చేయబడిన ఒక హెచ్చరిక. ఎన్నికలు, అధికారంలో ఉండటం తమకు ద్వితీ య ప్రాధాన్యతలేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జనాభా పెరుగుదలను నియంత్రించాలని కేంద్ర ప్రభుత్వం తమిళనాడును కోరినప్పుడు, రాష్ట్రం దానికి కట్టుబడి నడుచుకుంది. తమను కోరిన విధంగా నడుచుకున్నందుకు ఇప్పుడు మాకు లభించిన శిక్ష ఇదేనా? దక్షిణ భారత రాష్ట్రాలకు ఎటువంటి నష్టం వాటిల్లదని పార్లమెంటులో ప్రధానమంత్రి స్పష్టమైన హామీ ఇవ్వాలని తాము డిమాండ్ చేశాము. కానీ, ఇప్పటికీ ఎటువంటి స్పందనా రాలేదన్నారు. వివిధ పార్టీలకు చెందిన ఎంపిలు ప్రధానమంత్రిని కలిసేందుకు సమయం ఇవ్వాలని డిఎంకె కోరింది, కానీ ఆ అభ్యర్థనను కూడా తిరస్కరించారు. తాము చెప్పిన వాటన్నింటినీ విస్మరించి, కేవలం డిఎంకెనే కాకుండా మరే ఇతర రాజకీయ పార్టీని గానీ, ఏ రాష్ట్రాన్ని గానీ సంప్రదించకుండానే, వారు ఏకపక్షంగా ముందు కు సాగడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

# చర్చలు జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిగణనలోకి తీసుకోకుండా ప్రోరేటా పద్ధతిలో సీట్ల పెంపు చేస్తే దేశ ఫెడరల్ సమతుల్యత దెబ్బ తింటుందని సిఎం పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అన్ని ప్రాంతాల సమాన ప్రాతినిధ్యం దేశానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సిఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ప్రభావం కలిగించే అంశమైనందున బాధ్యతతో అత్యవసరంగా లేఖ రాసినట్లు తెలిపారు.

**మహిళల రిజర్వేషన్, పునర్విభజన, లోక్‌సభ సీట్ల పెంపు కలిపి గందరగోళం**

ప్రస్తుతం మహిళల రిజర్వేషన్, పునర్విభజన, లోక్‌సభ సీట్ల పెంపు అనే మూడు వేర్వేరు అంశాలను ఒకదానితో ఒకటి ముడిపెట్టి ప్రజలలో గందరగోళం సృష్టిస్తున్నారని, అవి పూర్తిగా వేర్వేరు విషయాలని స్పష్టం చేశారు. మహిళల రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని సిఎం తెలిపారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లలోనే 33శాతం మహిళల రిజర్వేషన్‌ను యథాతథంగా వెంటనే అమలు చేయాలని, అన్ని రాష్ట్ర అసెంబ్లీలలో కూడా అమలు చేయాలని కోరారు. మహిళల రాజకీయ సాధికారత కేవలం చట్టపరమైన మార్పు మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ఒక నైతిక అవసరమని సిఎం పేర్కొన్నారు. పునర్విభజనకు సంబంధించి గతంలో కూడా సీట్ల సంఖ్య పెంచకుండా కేవలం నియోజకవర్గాల సరిహద్దులను మార్చుతూ డిలిమిటేషన్ నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు కూడా దేశవ్యాప్తంగా అలాంటి ప్రక్రియను చేపట్టవచ్చని తెలిపారు. లోక్‌సభ సీట్లను 850కు పెంచే ప్రతిపాదన అసలైన వివాదాస్పద అంశమని పేర్కొన్నారు. ప్రస్తుత సీట్లను పెంచి వాటిని ప్రోరేటా పద్ధతిలో కేటాయించే ఆలోచనపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రిజర్వేషన్‌కు పూర్తి మద్దతు ఇవ్వటంతో పాటు, సీట్ల సంఖ్య పెంపు లేకుండా డిలిమిటేషన్‌కు పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. జనాభా లేదా ప్రోరేటా పద్ధతిలో లోక్‌సభ సీట్ల పెంపు ప్రతిపాదనను అనేక రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించబోవని తెలిపారు. ప్రోరేటా పద్ధతిలో అమలు చేస్తే దేశంలో తలెత్తబోయే పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు. 1970ల నుంచి దేశం జనాభా నియంత్రణ విధానంపై దృష్టి పెట్టినప్పటికీ, రాష్ట్రాల వారీగా జనాభా నియంత్రణ అమలు జరిగిన తీరు భిన్నంగా ఉందన్నారు. జనాభాలో తేడాల వల్ల జాతీయ ఐక్యతపై ప్రభావం పడే ప్రమాదాన్ని గుర్తించి, ఇందిరా గాంధీ, అటల్ బిహారి వాజ్‌పాయ్ వంటి నాయకులు ఈ అంశాన్ని ఒక్కోసారి 25 సంవత్సరాల పాటు వాయిదా వేసినట్లు తెలిపారు.

**దక్షిణ రాష్ట్రాలపై పడే ప్రభావాన్ని కేంద్రం విశ్లేషించలేదు**

సీట్ల పెంపుతో దక్షిణ రాష్ట్రాలపై పడే ప్రభావాన్ని కేంద్రం పూర్తిగా విశ్లేషించలేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలు దశాబ్దాలుగా జనాభా స్థిరీకరణ, ఆరోగ్యం, మానవ అభివృద్ధి రంగాల్లో కృషి చేశాయని తెలిపారు. ఇవన్నీ జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా చేపట్టిన చర్యలని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రతిపాదనతో ఈ రాష్ట్రాలన్నీ నిర్మాణాత్మకంగా నష్టపోతాయని, రాజకీయంగా బలహీనపడే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రోరాటా మోడల్ కేవలం గణాంకాల మార్పుగా కాకుండా, రాజకీయ అసమతుల్యతకు దారి తీస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు నిధుల పంపిణీలో ఇప్పటికే పక్షపాతం, వివక్ష ఉన్నట్లు తెలిపారు. బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఎక్కువ నిధులు పొందుతుంటే, తెలంగాణకు తక్కువ నిధులు వస్తున్నాయని ఉదాహరణగా చెప్పారు. ఇది దక్షిణాదిఉత్తరాది అసమానతకు సంకేతమని పేర్కొన్నారు.

**రాజకీయంగా అన్యాయం జరుగుతుంది**

ఇప్పటి వరకు జరుగుతున్న నిధుల వివక్షకు అదనంగా ఇప్పుడు నియోజకవర్గాల పెంపు కారణంగా దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని సిఎం తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా సహకరించినప్పటికీ, పార్లమెంట్‌లో వారి ప్రాధాన్యం తగ్గిపోతుందని, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తరాదిమధ్య ప్రాంత రాష్ట్రాలు లాభపడతాయని సిఎం వివరించారు. అభివృద్ధిలో పాలుపంచుకున్న రాష్ట్రాలకు శిక్ష పడుతుందని, జనాభా పెరిగిన రాష్ట్రాలకు ప్రోత్సాహకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇది అంకెల విషయం కాదని, దేశ సమగ్రత, సమానత్వం, న్యాయానికి సంబంధించిన ప్రాథమిక అంశమని స్పష్టం చేశారు. దక్షిణ రాష్ట్రాలు జాతీయ ఆదాయానికి నిరంతరం సహకరిస్తూ, సుపరిపాలన, అభివృద్ధి ప్రమాణాలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఈ కృషిని పట్టించుకోకుండా దేశ ఐక్యతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు.

**ప్రోరేటా మోడల్‌ను దక్షిణ రాష్ట్రాలు అంగీకరించవు**

ప్రోరేటా మోడల్‌ను దక్షిణ రాష్ట్రాలు అంగీకరించవని, ఈ అంశంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉత్పన్నమవుతుందని, అందరికీ న్యాయం జరిగేలా ఒక స్థిరమైన పరిష్కారం అవసరమని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. హైబ్రిడ్ మోడల్ ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుందని సిఎం సూచించారు. అందరి ప్రాతినిధ్యంతో పాటు అన్ని రాష్ట్రాల సహకారాన్ని ఈ మోడల్ సమతుల్యం చేస్తుందని వివరించారు. సుప్రీంకోర్టు సూచించిన 50 శాతం 50 శాతం విధానాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. హైబ్రిడ్ మోడల్ ప్రకారం, కొత్తగా పెంచే సీట్లలో సగాన్ని ప్రోరేటా పద్ధతిలో, మిగతా సగాన్ని జిడిపిలో రాష్ట్రాల ఆర్థిక భాగస్వామ్యం (జిఎస్‌డిపి), అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా కేటాయించాలని సూచించారు.

హైబ్రిడ్ మోడల్ ద్వారా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు నష్టపోకుండా ఉండటంతో పా టు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సూత్రం అమలవుతుందన్నారు. ఈ అంశంపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపి, అన్ని రాష్ట్రాలు మరియు రాజకీయ పార్టీలతో కలిసి ఒక ఏకాభిప్రాయానికి రావాలని కోరారు. 'భారతదేశ బలం భిన్నత్వంలో ఏకత్వం. ఇలాంటి కీలక నిర్ణయాలు ఆ ఏకత్వాన్ని బలోపేతం చేసేలా ఉండాలి. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అందరికీ న్యాయం చేసే పరిష్కారాన్ని కనుగొంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం' అని సిఎం తెలిపారు.

